

# గదిలో వసంతం

మురళీధర్

ఝుమ్మున వసంతం వచ్చినట్లుగా గదిలోకి దూసుకువచ్చింది వసంత. మండుటెండలో వానజల్లులాగా, చిలిపి చూపులతో దోచుకునే తియ్యని అమ్మాయి మనసులాగ, అప్పుడే 'ఫ్లవర్ వాజ్' లోకి వచ్చి తొంగిచూసి పలకరించే ఎర్రగులాబీలాగ, మరీమరీ సుగంధాన్ని చిమ్మే వగడపువ్వులాగ, విచ్చుకునీ విచ్చుకోని మల్లెపువ్వులాగ.

వసంత వస్తూందంటే ఆదేదోలా ఉంటుంది మత్తుగా, గమ్మత్తుగా. 'నైట్ క్వీన్' పూలగుత్తులాంటిదేదో ఉండి ఉండాలి. అదేదో కూనిరాగం తీసుకుంటూ గమ్మత్తుగా గదిలోకి వచ్చేసిందివసంత.

వసంత వస్తుందని ముందుగా తెలిసి ఉంటే– నిజంగా ఎంతబాగుండును? వసంతం వస్తుందని మనకు ముందే తెలిసినా, మనం కాచుకుని కూర్చుంటున్నాము గనకనా? మన గొడవలో మనం మునిగి ఉన్నప్పుడు ఏ మూల నుంచో కోయిలకూస్తే ఒక్కసారి ఎంత హాయిగా ఉంటుందని ప్రాణానికి? ఇంట్లో తెచ్చిపెట్టుకుంటేనో? మామిడి చివుళ్ళతోబాటు కుహూకుహూ రవాన్ని కూడా అక్కడే వదిలేసి వచ్చిందని మనకు తెలుసా?

పరవళ్ళుతొక్కే జలపాతం లోకానికి విద్యుత్తుని యిస్తుందిగాని పెరట్లోకి రమ్మంటే వస్తుందా?

వసంతకూడా అంతే ననుకున్నాను. అయినా సరూకి వసంతనుగూర్చి చెప్ప టమేపని, 'మరి వసంత పాడిందంటేనే' 'మరి వసంత నవ్విందంటేనే', 'నిజంగా వసంత ఎంతబాగుంటుం దనుకున్నావు' 'నువ్వు సరిగ్గాచూడలే దనుకుంట వసంతని.'

ఇదీవరస

విసుగొచ్చి అన్నాను సరూతో– 'మీ వసంత ఎవరోగాని, తీసుకొస్తే ఒక సారి తీసుకొచ్చి పరిచయం అయినా చెయ్యి; లేకపోతే చెప్పటం అయినా మానెయ్యి ఆ అమ్మాయినిగూర్చి' అని.

'ఎందుకురా అన్నాయ్ అంత యిది నీకు. వసంత నీ దగ్గరకు వచ్చి మాట్లాడలేదనేగా ?'

'అదికాదు సరూ.'

'ఏది అవునో చెప్పరా.'

సరూ, వసంత – యిద్దరూ ఫైనల్ ఆనర్స్‌లో ఉన్నారు. నేను యింకా లిట్రేచర్ లోరి పెర్చివెలగబెడుతున్నాను. ఒకఏడాది అయిపోయింది. మరోఏడు కనీసం పడుతుంది– పూర్తి అయ్యేసరికి. డిగ్రీపుచ్చుకుని ఏ లెక్చరర్ ఉద్యోగమో వచ్చేసరికి మరోఏడు పడుతుంది. 'ఏమిటో' అనిపించింది తలుచుకుంటే.

మరో వారంరోజుల తర్వాత వసంత మా యింటికివచ్చింది. వసంత వచ్చే సరికి నేను నాగదిలో పుస్తకాల్లో మునిగి ఉన్నా.

మళ్ళా అదేవసంతం. నిశ్చలంగా ఉన్న ప్రకృతి ఒక్కసారిగా ఝుమ్మని ఊగిపోయింది. పుస్తకంలో పేజీలో ప్రతిఅక్షరం ఏదో మత్తుగా, గమ్మత్తుగా.

ఒక్కసారి పుస్తకం పక్కకుపెట్టి చూశాను. వసంత ;

'నమస్కారమండి '

'హలో.'

'వసంత' అంది సరూ.

'అవును' అన్నాను.

'మీ కెలా తెలుసు.'

'అ...అవును...తెలుసు ..'

'మీరు ఒకొళ్ళనొకరు పరిచయ మేనా ఏమిటి ? మర్చిపోయా; అంతకు ముందు ఒకసారి వచ్చిందిగా యిక్కడికి?'

'ఉహూ'

'ఏమిటిరా అన్నిటికీ 'ఊ' 'ఉహూ' అంటావు' అంది సరూ.

వసంత గదిలో పుస్తకాలపై పే అదే పనిగా చూస్తోంది.


'మీరు థీసిస్ ఎప్పుడు 'సబ్‌మిట్' చేస్తున్నారు ?'

'ఎప్పుడా– అని ఆలోచిస్తున్నాను.'

ఒక్కసారి నవ్వింది. మళ్ళా విచ్చీ విచ్చని మల్లెపూల వాసనలు విరజిమ్మి నట్లుగా అనిపించింది.'

'మీరు కాలేజీ అయిపోయిన తర్వాత ఏంచేస్తూ ఉంటారు ? మీ హాబీఏమిటి?'

'కాలేజీ అయిపోవట మంటూ ఉంటేగా ?'




'అవును, వసంతకు తీరికెక్కడ? పార్టీ మీదపార్టీ'. వసంతకు కోపం వచ్చినట్లుగా చూసింది సరూవైపు.

'మీకు కోపంగూడా వస్తుందన్నమాట.'

వసంత ఒక్కచూపు విసిరింది నావైపు మల్లెచెండులాగ. ఒక్కొక్కళ్ళ మాటలో సంగీతం, నవ్వులో సౌరభం, నడకలో ఒక పొగరుమోతుతనం లాంటి కొంటెదనం, కొట్టొచ్చే చూపుల్లోంచి దూసుకువస్తూ మాటలకు అందని మరోమరో చక్కని చిక్కని ఊహకన్న మధురంగా, ఒకప్పుడు గాలికన్న తేలికగా, నిశ్శబ్దాన్ని చీల్చుకుని వచ్చే వలపు పిలుపులాగ.

వెళ్ళిపోయింది వసంత వచ్చినట్లుగానే ఒక్కసారి మల్లెలు వాడిపోయాయి. హాయి వీస్తూ, ఒంటికి మెత్తగా తగులుతూన్న గాలి ఆగిపోయింది. సంగీతపు గొంతును ఎవరో నొక్కేశారు. నిండుగా ఉన్నగది ఒక్కసారిగా బోసిగా అయిపోయింది.

ఆవాళ మర్నాడు. రోజు మరోరోజు.

మరోరోజు లైబ్రరీదగ్గర కనిపించింది. మళ్ళీ అదేనవ్వు. అవును నవ్వంటే అదే- అలా నవ్వలేనివాళ్ళు నవ్వకూడదు ఎప్పుడూ.

ఇద్దరంకలిసి కాఫీతాగి కబుర్లుచెప్పుకున్నాము. వసంత ఏమాత్రం వెనకంజ వెయ్యకుండా కులాసాగా కబుర్లుచెప్పింది. ఆవాళ యింటికివచ్చి చూస్తే గది అంతా ఏదో కొత్తగాఉంది. ఏమూలనుంచో

మల్లెపూలవాసన. మత్తెక్కించే ఏదో సౌరభం.

సరూ ఏదో పసికట్టిన దానికిమల్లే 'ఏరా అన్నాయ్, మహా ఉషారుగా వున్నావు, వసంత కనిపించిందా?'

'ఇంక నాకు వేరేపని ఏమీలేనట్లు.'

'ఉన్నట్లు.'

సరూకు ఏమి సమాధానం చెప్పాలో తోచలేదు; ఒక్కకసురు కసిరాను. అది కసురులాగ కనిపించలేదు. మరీమరీ నవ్వుతూ వెళ్ళిపోయింది.

మరో ఏడాది గడచిపోయింది. పరీక్షలు అయిపోయాయి_ వసంతకీ సరూకూను. యిద్దరికీ "ఫస్ట్‌క్లాస్" వస్తుందని అనుకున్నారు.

వసంత మరో మూడు రోజుల్లో విశాఖపట్టణం వదిలిపెట్టి కాకినాడ వెళ్ళిపోతుంది. ఆవాళ సాయంత్రం వసంత కలిసింది. కాఫీ తాగుతూన్నప్పుడు అన్నాను.

"మీరు యింతకీ కాకినాడ వెళ్ళిపోవటం ఏమీ బాగోలేదు."

"మరి ఏం చెయ్యాలంటారు."

"ఇక్కడే ఉండిపొమ్మంటాను."

"ప్రోఫీ లెండి అక్కడితో ఆగారు."

వసంత ఎందుకో ఆ సాయంత్రం మరీమరీ మెరిసిపోతోంది. జడలో మల్లెలు తురుముకుంది. ఎర్ర గులాబీ రంగుచీర, అదేరంగు బిగుతైన 'స్లీవ్‌లెస్' జాకెట్టు వేసుకుంది. దోసగింజలాంటి తిలకం పెట్టింది. అర మోడ్పు కళ్ళు, వాట్లల్లోంచి దొంగలాగ తొంగిచూసే చూపులూను. జాకెట్టును చీరనూ వేరుచేసే మెరిసిపోయే ఉండీలేని నడుము.

"ఏమిటి అలా చూస్తున్నారు. నేను కొత్తగా కనిపిస్తున్నానా?"

'తలంటుకున్నారనుకుంట' అన్నాను అల్లరిగా నుదుటిమీదపడే ముంగురుల వైపు చూపిస్తూ.

'నేను తలకు అసలు మానె రాసుకోను. షాంపూ వాడతాను." మాటల్లో తను కాకినాడలో వాళ్ళ నాన్నగారి దగ్గర కొంతకాలం ఉండి తర్వాత ఏం చెయ్యవలసిందో ఆలోచిస్తానన్నది. వాళ్ళ నాన్నగారు గవర్నమెంటులో సెక్రటరీగాచేసి రిటైర్ అయిన తర్వాత కాకినాడలో యిల్లుకట్టుకుని అక్కడ ఉన్నారట. ఆయనకు వసంత ఒక్కతే సంతానం. తల్లి జబ్బు మనిషట. వాళ్ళ దగ్గర బంధువుల్లో ఒకతను మెడిసెన్ రిసెర్చి చేస్తున్నాడట మెడ్రాస్‌లో. తనకి యితర దేశాలు చూద్దామని ఉందని చెప్పింది. సరదాగా దేశాలు తిరుగుతూ అనుభవాలు రాస్తూ గడపటం ఎంత బాగుంటుందని అడిగింది.

నిజమే నన్నాను.

'మీరు చాలా మంచివారు' అంది వసంత.



"నువ్వు ఒట్టి చవటవి" అన్నట్లు వినిపించింది నాకు.

"మీరు కాకినాడవస్తే తప్పకుండా మా యింటికి రండి," అంది వసంత.

"నీ ముఖం చూపించినా చూపించక పోయినా పెద్ద నష్టమేమీలేదు" అన్నట్లు వినిపించింది, వసంత వెడుతూ వెడుతూ అంది.

"మీరు నిజంగా ఉండిపొమ్మంటారేమో ననుకున్నాను చెప్పొద్దూ?"

"అంతే."

"మీరు అన్నమాటలు ఏదో మొగమాటానికి అన్నట్లు ఉన్నాయి కాని..."

"మీకు నేను అర్థం కాలేదన్నమాట- అయితే."

"అది చాలా పెద్దమాట కదూ?"

"మనకి ఉన్న కొద్దిపాటి పరిచయంతో అంతపెద్దమాట వాడకూడదంటారు- అవునా?"

"అది కాదు నా ఉద్దేశ్యం"

"మీరంటే నాకు ఏ అభిప్రాయం ఉందో..."

"అదే అభిప్రాయం ఉండనివ్వండి"

వసంత నన్నుగురించి ఏమనుకుంటోందోనని ఆలోచించే వ్యవధి ఇయ్యలేదు. ఇద్దరం ఆ యింటికి వచ్చేశాం; వసంత కాకినాడ వెళ్ళిపోయింది. సరూ వసంతా యిద్దరూ సెకండ్‌క్లాస్‌లో ప్యాస్ అయ్యారు. సరూ కాలేజీలో లెక్చరర్ అయింది. నేను "థీసిస్" సబ్‌మిట్ చేశాను. నాకూ్కడా ఓ "లెక్చరర్" ఉద్యోగానికి హైద్రాబాదులో ఓ కాలేజీ నుంచి పిలుపు వచ్చింది. గిరుక్కున ఏడాది తిరిగేసరికి నాకు డాక్టరేట్ రావటం, అమ్మా, నాన్నా నా పెళ్ళి కోసం కంగారు పడటమూ జరిగింది. చెల్లాయి పెళ్ళిముందర చెయ్యమన్నాను. సరూ యిప్పుడిప్పుడే చేసుకోనన్నది. ఆడపిల్లే చేసుకోకపోతే మగవాడికి నాకు తొందరేమిటని నేనూ పట్టుపట్టాను.

హైద్రాబాద్‌లో ఆర్ట్సుకాలేజీలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా చేరాను. అనుకోకుండా ఒక రోజు రాత్రి 'ప్లాజా'లో వసంత కలిసింది. పక్కనే వాళ్ళనాన్నగారు ఉన్నారు, పరిచయం చేసింది.

వసంత వాళ్ళ చిన్ననాన్నగారు ఒక కెమికల్ కంపెనీకి మానేజింగ్ డైరెక్టరుగా ఉంటున్నారట. హిమాయత్ నగర్‌లో ఉంటున్నారట. సరదాగా ఒక నెల రోజులు గడిపి పోదామని వచ్చారట వీళ్ళు. 'మా యింటికి రావోయ్ ఒకసారి. వసంత నిన్నుగూర్చి చాలా చెప్పింది. మీ చెల్లాయీ, వసంతా బాగా ఫ్రెండ్సటగా.'

అవునని తల ఊపాను. నేను ఏమీ కానా వసంతకు? ఎంత పెంకెతనం? అవును ఏమిటి తను నిజానికి?

నేను నారాయణగూడాలో మరో ఫ్రెండ్‌తోకలిసి రూమ్‌లో ఉంటున్నాను. కాలేజీ అయితే బాగానే ఉంది. అంతా కొత్త. అయినా ఏదో సరదాగా ఉంది. వారానికోసారి ఉత్తరం రాస్తోంది సరూ. యూనివర్సిటీ వదలిపెట్టి జీవితంలో- అంటే మళ్ళీ మరో యూనివర్సిటీలో చేరాను. అయినా ప్రతి వాళ్ళూ మీ ప్రొఫెసరూ, మీ హెడ్డూ మాప్రొఫెసరూ మీ గైడూ...యిదేవరస, లేకపోతే యింకా లోలోపల గిరిగీసుకుని ముసుకు లోకి వెళ్ళిపోయినట్లున్న మనుషులు, నెక్‌టై, సూటు ఊడదీస్తే, అస్థిపంజరం కనిపించినట్లు, యింక వీళ్ళ జీవితంలో ఏమీలేదా? వీళ్ళందర్నీ రేపొద్దున్నుంచీ కాలేజీకి రావద్దంటే ఏం




చేస్తారు? కొందరికి గుండెఆగిపోవచ్చు. మరి కొందరికి పిచ్చెక్కవచ్చు. మిగతావాళ్ళకి బ్లడ్‌ప్రెషర్ ఒక్కసారి ఎక్కువకావచ్చు. ఇన్ని కబుర్లు చెప్పే వీళ్ళ బతుకులో ఎంత ఖాళీ! ఇది తెలుసుకుంటే ఎంత వినోదంగా ఉందని?

మళ్ళా వారం రోజులకి 'ప్లాజా'లోనే కనిపించింది వసంత. వెంట వాళ్ళ నాన్నగారు లేరు యీసారి. సినిమా అయిన తర్వాత యిద్దరం కలిసి కాఫీ తాగాం- దగ్గర రెష్టారెంట్‌లో.

వసంత ఎప్పటిలాగే చలాకీగా ఉంది.

"మీరు మా యింటికి వస్తానన్నారు? మహా వచ్చేవాళ్ళలాగ- యింటినంబరూ ఫోన్‌నంబరు అన్నీ నోట్ చేసుకున్నారు కూడాను!"

"నేను రానని ఎందుకు అనుకుంటున్నారు?'

'అవుననుకోండి. నేను వెళ్ళేలోగా వస్తారేమోనని.'

'అంతే!'

'అంత ఆశ్చర్య పడ్డారేమిటి ఒక్కసారి?'

అవును. ఎందుకు అంత గాభరా పడ్డంత పని చేశాము? వసంత వెళ్ళిపోతేనేం? విశాఖ వదిలిపెట్టేంతరవాత మళ్ళా కలిసింది మొన్ననేగా? ఏదో ఎన్ని సంవత్సరాలో కలిసి ఉన్నవాళ్ళు

ఒక్కసారిగా విడిపోయినట్టు ఎందుకిలా అనిపించింది ?

'మదరాసు వేస్తున్నాం మకాం. నాన్నగారి చిన్ననాటి స్నేహితుడు రావు గారు – ఏదో ఒక రావుగారు లెండి – మరో 'టైర్' కంపెనీకి 'టాప్ బాస్' ఏదో కాస్త వినోదం – మరో రెండు వారాలు.'

'అది గాకుండా మద్రాసులో మీ 'కజిన్' మెడిసెన్‌లో రిసెర్చి చేస్తున్నారు కదూ?'

'మీకు బాగా జ్ఞాపకమున్నాయే అన్నీను – నన్ను గూర్చి మీరింత పట్టించుకుంటారని ఎప్పుడూ అనుకోలేదే?'

'మిమ్మల్ని గూర్చి యింతగా అనుకుంటున్నానని నాకుగూడా తెలియదు – మీరు చెప్పేదాకా'

'ఎంత గడుసు వారండీ నిజంగా'

'నిజంగా ?'

ఎందుకో ఒక్కసారి వసంత అర మోడ్పు కళ్ళల్లోకి చూశాను. ఎంత చంచలంగా ఉన్నాయి వసంతకళ్ళు? లోపల ఏం దాక్కుందో చూద్దామని, లోలోపలే ననుభవించి ఎన్నటికో ద్రవించిన 'అయిస్‌బర్గ్'లాంటి హృదయానికి భాషనుకూర్చలేని దేదో, ఏదేదో ఉంది. అవును నిజంగా వసంత... 'ఏమిటి ఒక్కసారి ఏదో లోకంలోకి వెళ్ళిపోయిన వాళ్ళకుమల్లే...'

'అలాగే అనిపిస్తోంది నాకు యివాళ నిజంగా' తేనెతుట్టెను ఎవరో కసిగా రాయితో కొట్టినప్పుడు చెదిరిన తేనె టీగల 'రొద'లాగ ఉంది వసంత నవ్వు.

'మీరు నన్నడుగుతే యీ ఉద్యోగం మానేసి ఏ తెలుగుసినిమాకో మాటలూ పాటలూ రాసుకోవటం మంచిదనుకుంట'.

ఇంక ఏమనాలో తోచలేదు. వెడుతూ వెడుతూ అంది వసంత – 'సరూకి కాలేజీ ఉద్యోగం బాగా నచ్చిందట – మరిమీకో.. అయినా ఎవరి అభిరుచి వాళ్ళది. మర్చిపోయా – మీరు వచ్చేముందు కాస్త శ్రమ తీసుకుని 'రింగప్' చెయ్యండి. ఫోన్ నంబరు మీదగ్గర ఉందిగా ? నాన్నగారు మీరు వస్తారేమోనని చూస్తున్నారు.'

'ఓ తప్పకుండా. రేపు సాయంత్రం వచ్చేముందర 'రింగప్' చేస్తాను.'


రూమ్‌కి వచ్చేసరికి సరూ ఉత్తరం ఉంది. వసంత చెప్పినట్లు సరూకి కాలేజీ జీవితం నచ్చింది. అందులో యిమిడి పోయింది. తను యిటూ అటూకాకుండా ఉన్నాడు. వసంతకు యివేవీ పట్టవు అసలు. అంతా అదో సరదా.

ఉత్తరం చదివాను.

'ఒరేయ్,

నువ్వు చాలా అమాయకుడివిరా? వసంత కలిసిందని రాశావు. ఏమేమిటో నీ మురిపెం, నువ్వూను. వసంత నాక్కావలసిన స్నేహితురాలు.

నా స్నేహితురాలి మనస్తత్వం నాకు తెలిసినంతగా మరెవ్వరికి తెలియదని గర్వంగా చెప్పగలను.




వసంతకి జీవితం ఒక పెద్దసరదా. మనుషులంతా వినోదానికి సామగ్రీ, సరంజామాను. నువ్వు వసంతనుగూర్చి ఏమేమి అనుకుంటున్నావో నాకు ఓ రకంగా తెలుసు. కాని ఒక్క విషయం నీతో చెప్పాలని ఉంది. అయినా నీకు నేను చెప్పేదేమిటి? చనువుతో రాశానంతే. నువ్వూ వసంతా కలిసి మాట్లాడుకున్న తర్వాత నా మాటలు పేలవంగా కనిపించవచ్చు కూడా. కాని వసంత ఏదోమాట వరసకి అంది – అప్పటికి వసంతని నీకు పరిచయం చేశానో లేదో మరి – చూస్తూ చూస్తూ కాలేజీలెక్చరర్‌నే చేసుకోవాలా ఏమిటి? ఉట్టి 'సెంటిమెంటల్ బోర్' అనుకో. అది గాకుండా వళ్ళంతా దులిపినా వంద రూపాయలు రాలవు; మరీ చప్పగా ఉంటుందనుకో, అంది.

వసంత అప్పటికీ యిప్పటికీ చాలా మారి ఉండవచ్చు. అందరం మారతాం కదా నిజానికి చూస్తే, వసంత మారిందని రాస్తే నేను ఆశ్చర్యపడను కాని మారిందా నిజంగా వసంత? రాస్తావు కదూ?

సరూ –

అంతకు ముందుదాకా ప్రతిరాత్రీ, కనీసం వారానికి ఓరాత్రయినా తియ్యని కల ఒకటివచ్చేది – కలలమీద పన్ను లేదు. బ్రతికిపోయాం – ఆరాత్రి కల మాట అలాఉంచి నిద్రకూడా పట్టలేదు. నిజంగా మొదటిసారిగా చాలా చికాకుగా. అస్తవ్యస్తంగా, అనుకోకుండా ఏదోలా..

మర్నాడు కాలేజీ ఎగ్గొట్టాను. తలనొప్పిగా ఉందని 'లీవ్' పంపాను. సాయంత్రం 'రింగప్' చేశాను – వసంతా వాళ్ళ నాన్నగారు ఉన్నచోటికి. ఇంట్లో పనిమనిషి ఫోన్ తీసుకుని వాళ్ళంతా ఉద

యమే బయటికి వెళ్ళారనీ మరోగంటకి గాని రారని నన్ను వచ్చేసెయ్యమని చెప్పారని చెప్పాడు.

విసుగొచ్చింది. ఏమిటి వాళ్ళఉద్దేశం? నన్నురమ్మని వాళ్ళు బయటకు వెళ్ళటం లోనూ వాళ్ళు వచ్చేదాకా నన్ను కాపలా కాస్తూ ఉండమనటంలోనూ ఉద్దేశ్యం ?

అంతకోపంలోనూ హిమాయత్ నగర్ వెళ్ళాను. హాలులో కూర్చు న్నాను. బాగా డబ్బున్నవాళ్ళయిళ్ళు-కాస్త చదువూ సంస్కారమూ ఉన్న వాళ్ళవి - అన్నీ యించుమించు ఒకే లాగ ఉంటాయిలాగ ఉంది చూస్తే ఈ మధ్య యిద్దరు ముగ్గురు యిళ్ళకి వెడితే యించు మించు అదేసరంజామా.

పదినిమిషాల్లో రానేవచ్చింది వసంత. 'కొంచెం ఆలస్యం అయిందోయ్. చాలా సేపయిందా వచ్చి? అమ్మాయ్ వసంతా!' అంటూ రామారావుగారు లోపలకు వెళ్ళారు. వసంత డ్రెస్‌మార్చుకుని చంగున వచ్చేసింది.

"సరూ దగ్గరనుంచి యీ మధ్య ఉత్తరమే లేదు. ఉద్యోగం మార్చిందా? పెళ్ళి అయిందా? అవ్‌కోర్సు- అంత చెప్పకుండా చేసుకోదు- అనుకోండి. కనీసం మీరన్నా చెబుతారుగా'

'అదేమిటి విచిత్రంగా మాట్లాడుతు న్నారు? మీరూ సరూ ఫ్రెండ్స్ కదూ.'

"అయితే మాత్రం? అన్నీ చెప్పా లని ఉందా? ప్రేమలోపడి ఉండవచ్చు' అని కొంచెం ఆగి నావైపు అదోలాచూసి "అదికూడా చెప్పాలంటారా" అంది క్రొంటెగా.

"ఎవరన్నా స్త్రీ మనసులోకి. హృద యంలోకి తొంగిచూడగలిగితే ఎంత బాగుండును ?"

"ఆ 'రిసెర్చి' మొదలెట్టారేమిటి?'


"చేద్దామనే ఉంది 'రిసెర్చి' గాని 'గైడ్' దొరకటం లేదు"

"సరిగ్గా చూడాలిగాని 'గైడ్' దొర క్కమానుతుంది"

ప్రతిసారి మాటల్లో ఓడిపోతూనే ఉన్నాను. వసంత గెలుస్తూనే ఉంది. ఆ సాయంత్రమూ అంతే జరిగింది.

ఆ ఆదివారం వసంత మద్రాసు వెళ్ళి పోయింది. ఈ సారి ఏదో ఖాళీగాఉంది. వసంత తనను ఎందుకు కవ్వించింది? తనను నవ్వించి, కవ్వించి వినోదకాల క్షేపం చేసి వెళ్ళిపోయింది. ఏమిటి వసంత ఉద్దేశ్యం? సరూ చెప్పింది నిజం. చూస్తూ చూస్తూ ఒక కాలేజీ లెక్చరర్ కోసం మోజుపడుతుందా వసంత? ఈ సంగతి సరూ రాసినా తనకు ఎందుకు తట్టి లేదు? ప్రతి మాటలోనూ కవిపించని నిర్లక్ష్యం చూపించినప్పుడుకూడా ఎందుకు తెలుసుకోలేకపోయాను ?

"దసరా పండగకి రూమ్‌లో ఉండట మేమిటి? మా యింటికి భోజనానికి రావోయ్"అని పిలిచాడు మరో లెక్చరర్ రమణారావు. రమణారావు నాకు ఆప్త




మిత్రుడేమీ కాదు. అయినా యింకొకళ్ళ సంగతుల్లో తలదూర్చడు. తన పాఠాలూ వ్యవహారం తప్ప మరే గొడవ లేదు. అందుకే పిలవంగానే 'సరే' నన్నాను.

వాళ్ళ ఇల్లు చిక్కడపల్లిలో. రమణారావు భార్య రమ స్కూల్లో టీచరుగా పనిచేస్తోంది. మరదలు శశికూడా మరో స్కూల్లో టీచరు- వీళ్ళదగ్గరే ఉంటోంది. అందరం కలిసి సరదాగా భోం చేశాం.

"మీ 'థీసిస్' దేనిమీదండీ" శశి అడిగింది.

"ఇలియట్ మీద"

"నాకూ ఇలియట్ పోయట్రీ అంటే యిష్టం"

"ఇలియట్ కవిత్వం చాలామందికి యిష్టం కాని-అర్థం అయ్యేది మాత్రం బహు కొద్దిమందికి."

"నా కా యిబ్బంది లేదులెండి. మీరున్నారుగా? మిమ్మల్ని అడగొచ్చు."

"మీకు మా యింట్లో ఒక స్టూడెంటు" అంది రమ వెంటనే.

వాళ్ళంతా ఎంతో కలుపుకోరుతనంగా ఉన్నారు. మొదటిసారి పరిచయం అయినప్పుడే ఎంతగా కలిసిపోయారు వీళ్ళు?

ఇంచుమించు సెలవు వచ్చినప్పుడల్లా రమణారావు వాళ్ళ యింటికి వెడుతూనే ఉన్నాను. ఇంచుమించు వాళ్ళ యిల్లు ఎంత అలవాటు అయిందంటే- వాళ్ళ

గట్టిగా పిలవకపోయినా - నేను వెళ్ళటం మాని ఉండేవాణ్ణికాదు.

"ఒకసారి నాతోబాటు 'టాజ్' లో ఫోం చెయ్యాలి మీరు. నాకు యిక్కడ యిల్లంటూలేదు గనక. మీరు రానంటే."

నన్ను మాట పూర్తి చెయ్యనియ్యకుండానే "టాజ్‌లో కాదు 'చార్‌మినార్'కు రమ్మన్నా వస్తాం సరేనా' అన్నది శశి.

"అయితే యీ ఆదివారం 'గండిపేట' పిక్నిక్‌కి వెడదాం. కాని ఒక్క షరతు. మీరు యింట్లోంచి ఏమీ తీసుకు రాకూడదు. నేను చూసుకుంటాను" అన్నాను.

"ఒక చిన్న 'అమెండ్‌మెంట్'. చార్‌మినార్ గండిపేటలో లేదు గనక".

శశి మాటపూర్తి చెయ్యనియ్యకుండా అందరూ నవ్వేశారు.

మళ్ళీ అందుకుని అంది శశి "ఇంట్లో చేసిన పులిహోరా అదీ వదులుకోదల్చుకుంటే..."

"ఇంట్లో వంటంతా నువ్వే చేస్తున్నట్టు 'పోజ్' కొట్టకుమరీను" అన్నది రమ.

"అదికాదండీ..."

"ఏది అవునో చెప్పండి" అన్నాను.

"ఇప్పటికి దొరికిపోయాను" అంది శశి.

"ఒక్కసారైనా దొరక్కపోతారా" అని నే నన్నమాటకు గుచ్చిగుచ్చి చూసింది - శశి నాలోకి.


సరూ వారానికో ఉత్తరం రాస్తూనే ఉంది. మొన్నవచ్చిన ఉత్తరంలో అంతా వసంతనుగూర్చే. వసంత మద్రాసులో చాలారోజులు ఉండిపోయిందనీ, రెండు మూడునెలల్లో 'స్టేట్స్'కు వెడుతోందనీను. అంతకుముందు వసంత అన్నది జ్ఞాపకంవచ్చింది.

సరూకి శశినిగూర్చి రాస్తూవచ్చాను. ఒకసారి సరూరాసింది - 'నువు ఒకప్పుడు వసంతనుగూర్చి ఎంతగానో ఆలోచించేవాడివి. ఇప్పుడు శశినిగూర్చి యించుమించు అదేరీతిగా ఆలోచిస్తున్నావు' అని.

వసంతనుగూర్చి ఆలోచించటం ఎప్పటికీ మానలేనని ఎలా చెప్పను సరూకు? ఎందుకుచెప్పాలి నిజానికి? మనసులోనిమాట చెప్పేసి బయట పడిపోవటంకన్న జరిగిందేముందిగనక?

అయినా సరూ వసంత - యిద్దరూ స్నేహితులు. వసంతనుగూర్చి తనకు చెప్పిచెప్పి పరిచయం చేసింది సరూ. అయినా వసంతనుగూర్చి యింతగాఆలోచించమనిగాని, యింతగా పదేపదే తలుచుకోమనిగాని చెప్పిందా?" నేను కావాలనే పెంచుకున్నానా వసంతమీద?

వసంత తనంటే ఎంత అభిమానంగా ఉన్నట్లు కనిపించినా, అంటీ ముట్టనట్లు ఉంది నిజానికి. అయినా ఎందుకు తను వసంతనుగూర్చి యింతగా పదేపదే ఆలోచించడం?




వసంతను తలుచుకుంటే ఏదో మత్తు, ఏదో తియ్యనిఊహ, కమ్మనితలపు – ఎందుకు యిలా అనిపిస్తోంది– ప్రేమ పిచ్చిలో పడ్డవాడికిమల్లే.

వసంత తననుగూర్చి ఏమీ అనుకోకపోయినాతను వసంతనుగూర్చిఆలోచించకుండా ఉండలేకపోతున్నానని రాశాను.

సరూ మళ్ళీ ఉత్తరంలో వసంతను గూర్చి అంతగా ఆలోచించటాన్నిబట్టి చూస్తే నేను ఆ అమ్మాయిపైన ఏవేవో పిచ్చిఆశలు పెట్టుకున్నట్లు కనిపిస్తోందని రాసింది.

సరూకి సమాధానం ఏమనిరాయను? అయినా నా మనసులో ఏముందోసరూకేం తెలుసు? వసంతమీద ఆశలు పెట్టుకున్నా పెట్టుకోలేకపోయినా వసంతను గూర్చి అనుక్షణమూ ఏవో తెలియని కలలుకంటూనే ఉన్నాడు తమ.

మళ్ళీ ఆదివారం 'గండిపేట' పిక్నిక్‌కి వెళ్ళాం – రమణారావూ, రమా, శశీ నేనూను. పిక్నిక్‌లో నలుగురం కూర్చుని కాస్సేపు 'రమ్మీ' ఆడాం. రమణారావూ రమా ఒకపార్టీ. డబ్బుపెట్టి ఆడితేనే గాని బాగుండదుగనక డబ్బుపెట్టి ఆడాలన్నాడు రమణారావు. అయితే నేను ఆడనన్నాను, అది నా నియమానికి విరుద్ధం అన్నాను 'ఒక్కసారి మీ నియమాల్ని సడలిద్దురూ' అంది శశి.

అంత చనువుగా ఎలా అనగలిగింది శశి? శశితో నాకు పరిచయంకలిగి ఎంత కాలం అయిందని? ఇంత చనువుగా నాచేత అంతకుముందు చెయ్యనిపని ఎలా చేయించింది?

పేకాటలో మేమేగెలిచాము పది రూపాయలు. పేకాటలో వచ్చినడబ్బు దాయకూడదు గనక సినిమాకి వెడదాం

రమ్మన్నాడు మర్నాడు. మాటల్లో వసం తవిగూర్చి చెప్పాను. చాలా సేపు చెప్పి ఉండాలి.

"మీకు పులిహోర, అవడలు యిష్ట మటగా" అంది రమ మాటమార్చ టానికా- అన్నట్లు.

"ఎవరన్నారు? అయినా మీ కెలా కెలుసు?" అన్నాను.

"ఏం, శశి నీ కెల్లాతెలుసు చెప్పు?" అని శశివైపుచూసి శశి ఏమీ మాట్లాడక పోయేసరికి, రమణారావువైపు చూసి, చెప్పండి- మీ కెట్లాతెలుసు" అంది చమత్కారంగా రమ.

రమణారావు అన్నాడు 'అవునోయ్ నువ్వు అనలా అవాళ పులిహోరా ఆవడలు తింటే ఎంత బాగుంటుందని?"

నేను నవ్వి ఊరుకున్నాను

"ఇంతకీ మీకు యిష్టంఅవునాకాదా?" అంది కొంటెగా శశి,

"ఇష్టమేననుకోండి "

"మళ్ళీ అంత మొగమాటంఎందుకూ యీమాత్రం దానికేను?"

"దేనికైనా అయితే మొగమాట పడొచ్చంటారు- యింతకీ."

శశికి ఏమి చెప్పటానికీ సమాధానం దొరకలేదు. గమ్మత్తుగా గాలిలోకి చూసింది సీతాకోకచిలుక రెక్కలపైన రంగులనుచూసి విస్మయం పొందినదానికి మల్లే.

అనుకోకుండా ఎంతో హాయిగా గడచిపోయింది పిక్నిక్. మర్నాడు 'ఎన్ ఎఫైర్ టు రిమెంబర్' అనే యింగ్లీషుసినిమా. చూసి బయటకు వచ్చినా యింకా కారీగ్రాంట్, డిబోరా కెర్ కళ్ళల్లో తిరుగుతూనే ఉన్నారు.

"నాకు సినిమా చాలా బాగా నచ్చిందండీ" అంది శశి మర్నాడు కలిసినప్పుడు.

"మీకు ప్రేమమీద నమ్మకంఉందా?" అన్నాను అనంగానే నేను చాలా తెలివి తక్కువగా మాట్లాడినట్లుగా అనిపించింది.

ఇదేమిటి ఉండిఉండి యింత చవకగా మాట్లాడేశాను- అనిపించింది. శశి ఏమనుకుంటుందో- మామూలు తెలుగు సినిమాలో హీరో హీరోయిన్‌ని అడిగినట్లుగాఉంది- అనుకోరూ?

"బలేప్రశ్న వేశారండీ? నిజంగా ఒక మేష్టార్ని మరో మేష్టారు మరీ యిదిగా...ఎందుకులెండి."

"నా ఉద్దేశ్యం అదికాదు."

"నేను అపార్థం చేసుకుంటానని మీ రెందుకు అనుకుంటున్నారు? మీరు వసంతవిగూర్చి యిన్నిసార్లు చెప్పారంటే ఆ అమ్మాయి ఎవరో చాలా అదృష్టవంతురాలు అయిఉండాలి."

"మీకుమాత్రం ఏం?"

ఒక్కసారి బిక్కుమన్నట్లు చూసింది శశి. ఏదో అనకూడని మాటని అనేసి తప్పించుకో జూసినట్లు చూసింది.

"ఏదో అనేశాను ఏమీ అనుకోకండేం? కావలసిన దానికన్న ఎక్కువ చనువు తీసుకున్నాననుకుంట."



"లేదు. నిజానికి ఆమాటలు నావి. నేను అనవలసినవి. నిజానికి వసంతని గూర్చి మీకు చాలా లెక్చరిచ్చిఉండాలి, నేను. మా సరూ వసంతాకలిసి చదువుకున్నారు ఆనర్స్."

నాకు తెలియకుండా అలాగే వసంతనుగూర్చి చెబుతూనే ఉన్నాను.

"సరూ యిక్కడికి ఓ వారంరోజులు సెలవుపెట్టి రాకూడదూ? సరదాగా గడపవచ్చునుగదా."

"నిజమే, చూడండి. ఇక్కడైతే నేనూ, మీరూ బావగారూ, అక్కయ్యా అందరం సెలవపెట్టి తరలివెళ్ళాలి..." అని ఆగి ఏమనుకుందో ఏమో తనలో తానే నవ్వుకుని "తను అయితే ఒక్కతే సెలవుపెడితే సరిపోతుందిగా. మీరు రాస్తారా, నేనే చొరవగా రాయనా?"

"రాయండి మీరే, మీ మాట వినొచ్చు"

రూమ్‌కి వచ్చాను. ఏదో మత్తుగా గమ్మత్తుగా కనిపించింది శశి తో పిక్నిక్‌లో ఉన్నట్లుగానే ఉంది. శశి వేసుకున్న గులాబీరంగు వాయిల్‌ చీర, వంటికి బిగుతుగా అంటిపెట్టుకుని వంపుల్ని మరీ మరీ కొంటెగా ... లోతైనా కళ్ళల్లోంచి దూసుకువచ్చే చూపులూ, సన్నని 'టాపరింగ్' డాన్సర్స్ వేళ్ళు... పిరుదులు దాటి నిర్లక్ష్యంగా పాకే రెండు జడలూ ... ఏ మాత్రం అహం భావం లేకుండా ఎంతో చనువుగా పలకరించే పెదిమలూ, తీర్చిదిద్దిన కనుబొమ్మలూ, వంపుతిరిగిన ముక్కు ... శశి ఒక్కసారి కళ్ళల్లో మెదిలింది.

మళ్ళా వసంత కళ్ళల్లో మెదలింది. ఇప్పుడేమిటి చేస్తూ ఉంటుందో? బహుశః 'స్టేట్స్‌కి' వెళ్ళిపోయి ఉంటుంది, మెడ్రాస్‌లో అతనితో కలిసి.

అయినా వసంతని గూర్చి తను కలలుగనటమే గాని, వసంత తనను గూర్చి ఎప్పుడైనా అనుకుందా? ఏమో, తన కెలా తెలుసు? మాటలలోని నిర్లక్ష్యం, మనసులో ఏముందో తెలుసుకోనివ్వని జాణతనం, నిజమే– తనని ఏమి తెలుసుకోనిచ్చిందని?

అయితే మరి వసంతని గూర్చి ఇన్నిసార్లు, ప్రతి క్షణం అనుకోవటానికి కారణం తన బలహీనత; శశితో ఉన్నంత చనువుగా ఎందుకు ఉండలేకపోయాను.

ఇది కేవలం నా ఊహ. వసంత నాతో కూడా చాలా చనువుగా ఉంది. యూనివర్సిటీలో చాలాసార్లు ఎంతో యిదిగా మాట్లాడింది. సరూ వసంత కలిసి చదువుకున్నారు. మరి కొంతలో కొంత నన్ను గూర్చి తెలుసు వసంతకు.

నేను వసంతా_వసంతకీ నాకూ మధ్య యింత ఆకర్షణ ఉంది. ఈ ఆకర్షణ ఎందుకు వేరే రూపం దాల్చలేదు? ఎందుకు వసంతకి దగ్గరగారాలేకపోయాను? ఎందుకు నేనూ వసంతా మరీమరీ దగ్గరకు రాలేకపోయాం?

సరూ రాసింది నిజమేనేమో? కొంతమంది తాము కట్టుకున్న గూటిలోకి ఎవర్నీ రానివ్వరు; గూటిచుట్టూ తిరగనిస్తారు. గూటికి మాత్రం మనస్సనే ఘూర్కా_వాడిని కాపలా పెడతారు. ఆ 'షెల్'లోకి ముడుచుకుని భద్రంగా ఉంటారు.

అంతా కేవలం వినోదం, ఒక సరదా. అవునా అంతా సరదా! కొత్తకులాసాగా మాట్లాడేవాళ్ళు మరికొంచెం దగ్గరగా వచ్చామనుకుని సంతోషపడతారు అంతే.

ఒక్కసారి గది కిటికీ తలుపు తోశాను. చల్లనిగాలి వంటికి తలిగింది. ప్రాణం లేచొచ్చింది. రేడియోలోంచి తియ్యని పాట విన్పిస్తోంది. మళ్ళీ అదే విచ్చీవిచ్చని మల్లెపూలవాసన. గదిలోకి వసంతం వచ్చినట్లయింది. గదిలో